www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 4 నవంబర్ 2023

5

పశ్చిమ గోదావరి

సమిత్వ సర్వేకు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అన్ని గ్రామాల్లో సమిత్వ సర్వే జరుగుతుందని, ప్రజలంతా దీనికి సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ కంఠంలో ఉండే ప్రభుత్వ భూములు, వ్యక్తిగత ఇల్లు, ఖాళీ స్థలాలు కొలతలు వేసేటప్పుడు ముందుగానే గ్రౌండ్ ట్రూ తింగ్ ఇస్తారని పేర్కొన్నారు. వాటిని అందుకున్న ప్రజలు ఆ సమయంలో అక్కడే ఉండి ఆస్తి తాలూకా పత్రాల నకళ్లు అందజేసి సర్వే బృందానికి సహకరించాలని కోరారు.

మళ్లీ ఉల్లి ఘాటు.. టమోటా మోత

పెరుగుతున్న ధరలతో జనం లబోదిబో

ప్రజాశక్తి - పాలకొల్లు

రోజురోజుకీ పెరుగుతున్న ఉల్లిపాయలు, టమోటా ధర పేద, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. 15 రోజుల క్రితం వరకూ కిలో రూ.20 నుంచి రూ.25 ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం కిలో రూ.70కుపైగానే ధర పలుకుతోంది. దీంతో మహిళలకు ఉల్లి కోయక ముందే కన్నీరు వస్తోంది. కొన్ని నెలల క్రితం కిలో టమోటా ధర డబుల్ సెంచరీకి చేరి అందరినీ ఠారెత్తించింది. గత నెల రోజులుగా కిలో రూ.20కు తగ్గిన టమోటా వారం రోజుల నుంచి పెరుగుతూ ప్రస్తుతం రూ.40కు చేరింది. బంగాళాదుంపలు హోల్‌సేల్ మార్కెట్లో కిలో రూ.17గానే ఉన్నా రిటైల్ మార్కెట్లో కిలో రూ.30గా ఉంది. పచ్చిమిర్చి గతేడాది ఇదే సీజన్‌లో కిలో రూ.20 నుంచి రూ.30 మధ్య ఉండగా ఈ ఏడాది కిలో రూ.50 నుంచి రూ.70 మధ్య ఉంది. అల్లం ధర కూడా అనూహ్యంగా పెరిగింది. వెల్లుల్లి మూడు నెలల క్రితం కిలో రూ.40 నుంచి రూ.50 నడుమ ఉండగా ప్రస్తుతం కిలో రూ.180 నుంచి రూ.220 మధ్య నాణ్యత బట్టి ధర ఉంది. ఇక సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాడే కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.190 మధ్య ఉంది. దీంతో సామాన్యులు కూరగాయలంటేనే బెంబేలెత్తుతున్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా అమరావతి నుంచి కలెక్టర్, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మూడు విభాగాలతో కూడిన రక్షణ దళాలను ఉపయోగించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇదే విధంగా రక్షణ దళాలను ఏర్పాటు చేయడంతో పాటు, మరో నాలుగు విభాగాలను కూడా రక్షణ దళాల సేవల్లో వినియోగించుకోనున్నట్లు తెలిపారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని వివరించారు. ఎన్నికల విధుల నిర్వహణకు 782 మంది రక్షణ సిబ్బంది కొరతను జిల్లా ఎస్‌పి గుర్తించారని, వారి స్థానంలో రిటైర్డ్ మిలటరీ ఆఫీసర్‌లు, ఎన్‌సిసి, మహిళా పోలీస్ తదితరుల సేవలను ఉపయోగించుకునేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నామని తెలిపారు. 434 సెక్యూరిటీ వాహనాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్‌కు సంబంధించి 392 వాహనాలకు ప్రతిపాదించగా ఇంతవరకు అందుబాటులో ఉన్న వాహనాల పూర్తి వివరాలతో కూడిన నివేదిక త్వరలోనే సమర్పిస్తామని చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఉండే భవనాలను గుర్తించామని, వాటిలో ఎక్కువ శాతం పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేశామని తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. ముఖ్యంగా నెలమూరు, వెలగలేరు, ఓడూరు, మార్టేరు, ఆలమూరు, భట్లమగుటూరు, పెనుమంట్ర తదితర గ్రామాల్లో కొద్దిసేపు వర్షం కురిసింది. వర్షం కారణంగా సాగునీటి సమస్య నుంచి కొంత ఉపశమనం దక్కుతుందని కొంతమంది రైతులు చెబుతుండగా తెగుళ్ల విజృంభించే అవకాశం ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకురూరల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 19 విభాగంలో భాగంగా అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల జూనియర్ విద్యార్థినులు ఎల్.పావని, ఎస్‌ఎం గాయిత్రి ద్వితీయ స్థానాన్ని సాధించారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విద్యార్థినులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు కళాశాలలో క్రీడా సదుపాయాలను వినియోగించుకుని క్రీడల్లో మంచి ప్రతిభను కనబర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఎం.రత్నకుమారి అభినందించారు.

గెలుపొందిన ఎస్‌కెఎస్‌డి విద్యార్థినులు

కరువు పై.. కళ్లు తెరిచేనా..!

ఎండిపోయిన వరి పంట పొలం

వర్షాల్లేక నీటిఎద్దడితో పంటలపై పెను ప్రభావం

వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నా పట్టని అధికారులు

కరువు మండలాల ఎంపికలో తీవ్ర నిర్లక్ష్యం

పంటను కోల్పోయి, ఉపాధి లేక సమస్య తీవ్రతరం

ప్రజాప్రతినిధుల మౌనంపై జనం తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వర్షాభావంతో వేలాది ఎకరాలకు సాగు నీరందక పంటలు దెబ్బతిన్నా జిల్లా అధికార యంత్రాంగం కళ్లుతెరవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కరువు మండలాల జాబితాలో జిల్లాలో ఏఒక్క మండలం లేకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యమే ప్రధానంగా కనిపిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం నాలుగు నెలల్లో మూడునెలలు సరిగ్గా వర్షాలు కురవలేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో పంట పొలాలు ఎండిపోవడంతో పశువుల మేతగా మారడం కళ్లముందే కన్పిస్తోంది. భూగర్భ జలాలు తగ్గి బోర్ల నుంచి నీరు రాకపోవడం స్పష్టంగా తెలుస్తోంది. ఒక్క చింతలపూడి మండలంలోనే ఐదు వేలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతుల లెక్కలు చెబుతున్నాయి. కృష్ణా డెల్టాలో ఆయకట్టుకు సాగు నీరందక పొలాలు బీటలు వారాయి. ఏలూరు జిల్లాలో 27 మండలాలుండగా దాదాపు పది మండలాల్లో తీవ్ర నీటిఎద్దడి సమస్య ఏర్పడింది. చెరువులన్నీ అడుగంటాయి. బోర్ల నుంచి సరిగా నీరు రావడం లేదు. అయినప్పటికీ కరువు మండలాల జాబితాలో జిల్లాలో ఒక్క మండలానికి కూడా చోటు దక్కలేదు. కరువు కమ్మేయడంతో పంటలు దెబ్బతినడం, ఉపాధి సైతం లేకపోవడంతో జనం అల్లాడుతున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా వేలాది ఎకరాల్లో పంట చేతికందే పరిస్థితి లేకుండాపోయింది. ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతిందో అధికారులు చెప్పకుండా దాచేస్తున్న పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు సైతం రైతులను గాలికొదిలేశారు. ఎండిన పంట పొలాలనుగాని, కష్టాల్లో కూరుకుపోయిన రైతులనుగానీ పరామర్శించే నాధుడే లేకుండాపోయాడు. ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడి పెట్టి సర్వం కోల్పోయిన రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉంది. కరువుపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహించారో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. కరువు లేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్న తీరు అందరినీ తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. కళ్లముందే సమస్య కన్పిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటనే ప్రశ్నలు అందరినీ తొలిచేస్తున్నాయి. ద్వారకాతిరుమల, కామవరపుకోట వంటి మండలాల్లోనూ తీవ్ర దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

దెబ్బతిన్న పంటలపై లెక్క తేల్చండి

ఇప్పటి వరకూ నీటి ఎద్దడి సమస్యతో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన లెక్కల వివరాలు అధికారులు ఎందుకు బయట పెట్టడం లేదని రైతులు, రైతుసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రాథమిక అంచనాలు తయారు చేశారా, లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. కళ్ల ముందే పంటలు దెబ్బతిని పనికిరాకుండా పోయినా ఎందుకు పంట నష్టం నమోదు చేయడం లేదనే ప్రశ్నలకు సమాధానాలు లేకుండాపోయాయి. కరువు మండలాలపై ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపించారా అని రైతులు అడుగుతున్నారు. అధికారులు పంపించిన నివేదిక వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల సమస్యలు అధికారులకు ఎందుకు పట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరువుపై అధికారికంగా ప్రకటన చేయాలని, ఎందుకు కరువు ప్రాంతాలను గుర్తించలేదో చెప్పాలని అంతా డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి లేకుండా అల్లాడుతున్న రైతులు, రైతు కూలీలను ఏవిధంగా ఆదుకుంటారో చెప్పాలని ఆవేదన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటలపై వ్యవసాయాధికారులు ఎందుకు నోరువిప్పడం లేదనేది అందరికీ అంతుబట్టని ప్రశ్నగా మారిపోయింది. కరువు పరిస్థితులు జిల్లాలో లేవని చెప్పడానికి అధికారులు ఏవిధంగా అంచనాలు తయారు చేశారో రైతులకు తెలియజెప్పాలని అంతా కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కరువుపై కళ్లు తెరిచి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అంతా కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ఆకివీడు, తాడేపల్లిగూడెం నుంచి ప్రజారక్షణ భేరి జిల్లాస్థాయి ప్రచార యాత్రలు ప్రారంభం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ.. సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికను ప్రచారం చేస్తూ ఈ నెల 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతాలు జిల్లాలో ఆకివీడు, తాడేపల్లిగూడెం నుంచి శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ జాతాలు మూడు రోజులపాటు జిల్లావ్యాప్తంగా పర్యటించనున్నాయి. ఆకివీడులో జాతాను సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ప్రారంభించగా, తాడేపల్లిగూడెంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు ప్రారంభించారు.

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఎన్నికల వాగ్దానం గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఒక్కరూ నిరసించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. ఈ నెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణభేరి బహిరంగ సభ ప్రచార జాతాను శుక్రవారం స్థానికంగా బలరాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ధరలు, నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగాయన్నారు. అవినీతిని అరికట్టామంటూ కార్పొరేట్లకు వత్తాసు పలుకుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం విధానాలకు మద్దతునిస్తూ రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, కడప స్టీల్‌ప్లాంట్ వంటివి నేటికీ అమల్లోకి రాలేదన్నారు. కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేయడమే కాకుండా కొత్త రుణాలిచ్చి ప్రజాధనాన్ని కార్పొరేట్ల పాల్జేస్తున్నారన్నారు మిగిలిన రాజకీయ పార్టీలన్నీ ఓట్లు కోసం, సీట్లు కోసం, పదవుల కోసం పని చేస్తుంటే ఒక సిపిఎం మాత్రం ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుంటూ, నిరంతరం ప్రజల కోసం పని చేస్తోందన్నారు. అటువంటి సిపిఎంకు ప్రజలంతా అండదండలు అందించాలని ఆయన కోరారు. సిపిఎం పోరాటాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని జవహర్‌పేట, దుంపగడప, పొలిమేరకోడు తదితర ప్రాంతాల్లో జాతా పర్యటించింది, అనంతరం ఐ.భీమవరం, చెరుకుమిల్లి మీదుగా సాగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రచార యాత్రలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

తాడేపల్లిగూడెం : జాతాను ప్రారంభిస్తున్న చింతకాయల బాబూరావు

కాళ్ల: సిపిఎం చేపట్టిన 'ప్రజారక్షణ భేరి' ప్రచార యాత్ర శుక్రవారం మండలం మీదుగా సాగింది. జువ్వలపాలెం, కాళ్ల, సీసలి గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఈ నెల 15న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా అడిగే ధైర్యం రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వాసుపత్రులు నామమాత్రంగా తయారవ్వడంతో కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారన్నారు. యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, నేతలు జవ్వాది శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, తిరుమాని శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నేతలు ఎస్‌కె.వలీ, చైతన్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: సిపిఎం ప్రజారక్షణ భేరి ప్రచార జాతా శుక్రవారం సాయంత్రం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా జాతాకు నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాదాసి గోపి, మజ్జి నాగేశ్వరరావు, మునకాల రవిరాజు, మేడపాటి ప్రశాంత్, బండి బాలాజీ, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని ఓడించాలి

తాడేపల్లిగూడెంలో యాత్ర ప్రారంభంలో చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం: రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని ఓడించాలని, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్బంధ విధానాలపై పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి జిల్లా జీపు జాతాను కెఎన్ రోడ్డులో గంగయ్య సందు వద్ద ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో చింతకాయల బాబూరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయడం లేదన్నారు. ప్రజలను కులాలుగా, మతాలుగా, ప్రాంతాలుగా విడగొడుతున్నారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తూ విపరీతంగా భారాలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పన్నులు, కరెంటు ఛార్జీల భారం విపరీతంగా పెంచుతూ ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రజలను మేల్కొలిపి ఐక్యం చేసి అండగా నిలిచేందుకు సిపిఎం రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రజారక్షణ భేరి యాత్రలు నిర్వహిస్తోందని అన్నారు. ఈ నెల 15న విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్డులోని ఫుడ్ జంక్షన్ నుండి బ్రహ్మాండమైన ర్యాలీ, ఉదయం 11 గంటలకు సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బహిరంగ సభలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా మందసలో నవంబర్ 2న ప్రారంభమైన రాష్ట్ర జాతా 7,8,9 తేదీల్లో జిల్లా మీదుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కర్రి సాయిరెడ్డి మేట్రెడ్డి రమణ, నరమాల కృష్ణ, పులిమంతుల రమణ, గొర్రెల సతీష్‌కుమార్, ఏపూరి శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: సిపిఎం ప్రచార జాతా తాడేపల్లిగూడెం మండలం ఇటుకలగుంట, అమృతపురం, లింగారెడ్డిగూడెం, దండగర్ర, జగన్నాధపురం, నవాబుపాలెం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా చింతకాయల బాబూరావుతోపాటు మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పనుల్లేక వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. యాత్రలో నేతలు పి.గాదినాయుడు, ఎస్.వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నేతలు పోతు శ్రీనివాసు, పి.నాగేంద్ర, తోట శ్రీను, శివ, గణేష్, కె.నరేష్ పాల్గొన్నారు.

పెంటపాడు: సిపిఎం జాతా పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆ సెంటర్‌లో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, నేత సిరపరపు రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, మరపట్ల దానయ్య, పెనగంటి దుర్గ, కరక వెంకట్రావు, యండ్రపు కృష్ణ, మాదాసు శ్రీను, కర్రి చిన వెంకటరెడ్డి, మద్దాల సూర్రావు, కృష్ణ పాల్గొన్నారు.

ఇక విద్యుత్ కోతలు ఉండవు

సబ్ స్టేషన్లను ప్రారంభించిన పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఇక విద్యుత్ కోతలు ఉండవని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలోని తాళ్లకోడులో 74 ఎకరాల జగనన్న కాలనీ కోసం ప్రత్యేకంగా రూ.6.30 కోట్లతో నిర్మించిన 220 కెవి సబ్ స్టేషన్‌ను పివిఎల్ నరసింహరాజు, జెడ్‌పిటిసి వేగేశ్న వెంకట్రాజుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గుమ్ములూరు రోడ్డులో గాలిబ్ చెరువు వద్ద ఆకివీడు దిగువ ప్రాంతంతో కలిపి ఐదు గ్రామాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 33 కెవి సబ్ స్టేషన్‌ను పివిఎల్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాలకు నగర పంచాయతీ ఛైర్ పర్సన్ జామి హైమావతి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కఠారి రాజ్యలక్ష్మి, ఫాన్సీ చైర్మన్ రసూల్ బేబీ, అయిభీమవరం సర్పంచి గాలి సామ్రాజ్యం, నగర పంచాయతీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాళ్లకోడులో విద్యుత్ సబ్‌స్టేషన్ జెడ్‌పిటిసితో కలిసి కలిసి ప్రారంభిస్తున్న పివిఎల్

వినూత్న పరిశోధనలతో నవశకానికి నాంది

నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వినూత్న పరిశోధనలతో నవశకానికి నాంది పలకాలని ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న టెక్రియా 2023 ఆరంబ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు దేశానికి దిక్సూచి వంటివన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెడితే అద్భుత ఆవిష్కరణలకు రూపకల్పన చేయొచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో అత్యాధునిక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాటికను గుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డీన్‌లు జిబి.వీరేష్ కుమార్, ఎన్.జయరామ్, కురుమయ్య, ఆచార్యులు వి.సందీప్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - పోడూరు

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో తూర్పుపాలెం, జిన్నూరుపాలెం గ్రామాల్లోని లబ్ధి దారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గుబ్బల ఉషారాణి, వీర బ్రహ్మం, గుడాల శిరీష చంటి, ఎంపిపి సబ్బితి సుమంగళి, జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, కర్రి వాసురెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోషినాయుడు అన్నారు. శుక్రవారం మూడో సచివాలయం వద్ద జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాది పిల్లలకు వ్యాధినివారణ టీకాలు వేయించాలన్నారు. ప్రతి బుధవారం, శనివారం గ్రామాల్లో టీకాల కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 191 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం నాలుగో సచివాలయం వద్ద స్థానికులకు పిఎంజెఎవై కార్డులు అందజేశారు. కార్డు ఉన్న వారికి రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎం.ప్రేమలీల, ఎ.కృష్ణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెలమూరులో గ్రామ సభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆక్వాసాగుకు నీటి ఇబ్బందులను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఇరిగేషన్ అధికారులు చెప్పారని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. నెలమూరులో ఆక్వాకల్చర్ అభ్యంతరాలపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మంగం శివకుమార్, నాగరాజు సుబ్బరాజు, యరకరాజు సుబ్బరాజు, కోయ జయశ్రీ వీరాంజనేయులు, నాగరాజు వెంకటాచామరాజు, ఎస్.శివరామకృష్ణ ఇటీవల గ్రామంలో ఆక్వాకల్చర్‌పై అభ్యంతరాలు పెట్టిన కారణంగా జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో గ్రామస్తులు, ఆక్వా రైతులు తమ సమస్యలను చెప్పారు. ఈ సందర్భంలో ఆక్వా రైతు కోయ జయశ్రీ వీరాంజనేయులు తమ అభ్యంతరాలపై అధికారులు నివేదిక సమర్పించినట్లు తప్ప ఎవరిపై అభ్యంతరాలు పెట్టలేదన్నారు. మరో ఆక్వా రైతు గొట్టుముక్కల సత్యనారాయణ ఆక్వా సాగుకు ఒక బోరు వేసేందుకు రూ.40 వేలకుపైగా ఖర్చవుతోందన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే తమకు నోటీసులు ఇచ్చారని, అందరికీ అధికారులు ఒకే న్యాయం చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కుచ్చెర్లపాటి మంగతాయారు, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, పొల్యూషన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటరమణ, ఎంపిడిఒ నాగరాజు లక్ష్మీ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

వీవర్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలం దగ్గులూరులో బ్రహ్మంగారి గుడి వద్ద వీవర్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.23 లక్షలతో నిర్మిస్తున్న ఈ కమ్యూనిటీ హాల్ చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పాముల రజిని కుమార్, ఫ్లోర్ లీడర్ శాగ సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి అందే కోటి వీరభద్రరావు, అవతార రాజు, మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ సాగర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పెనుగొండ:యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని డాక్టర్ సుధాకర్ వారణాసి తెలిపారు. స్థానిక ఎస్‌వికెపి అండ్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ వైవివి అప్పారావు అధ్యక్షతన భవిష్యత్ మార్గదర్శకత్వంపై సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ యువతకు వ్యవస్థాపకత వల్ల ఎంతో భవిష్యత్తు ఉందని, అవకాశాలున్న వ్యవస్థను స్థాపించడం వల్ల ఎంతో మంది అవకాశాలు పొందుతారని తెలిపారు. ఉద్యోగం కోసం వెతకడం కన్నా చిన్నగా స్థాపించిన సంస్థ అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. అవసరాన్ని బట్టి అవకాశాలను సృష్టించిన వచ్చని తెలిపారు. ఈ సందర్భంగా బయోలాజికల్ సైన్స్‌లో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో, ఇంటర్నెట్ ఉపయోగించుకోవడం, మార్కెటింగ్, బిజినెస్ తదతర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో జిఎస్‌ఎన్ రాజు మెరైన్ బయోపోలిమర్స్ డైరెక్టర్ ప్రసంగించారు. అలాగే డాక్టర్ సుధాకర్, రాజును ఘనంగా సన్మానించారు. సమావేశంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం మండలం మల్లవరం గ్రామానికి చెందిన జడ్డు రామ తులసి కొంత కాలంగా అనారోగ్య కారణాల వల్ల అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కీపురంలోని తన పెద్దకుమారుని వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న 10వ క్లస్టర్ వాలంటీర్ చాబత్తుల రోదే శుక్రవారం వర్షాన్ని లెక్కజేయకుండా మల్లవరం నుండి సుమారు ఇరవై కిలోమీటర్లు తన సొంత ఖర్చులతో వెళ్లి తులసికి పింఛను అందజేశారు. ఈ సందర్భంగా రామ తులసి కుటుంబ సభ్యులు వాలంటీర్ రోదేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

చివరికి కష్టాలు..!

సాగునీరందక నెర్రలు తీస్తున్న వరిచేలు
రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పోడూరు

ప్రస్తుతం సార్వా సాగులో వరి పొట్ట దశకు చేరింది. ఈ సమయంలో సాగునీరు లేక పొలాలు ఎండిపోయి నెర్రలు తీశాయి. ఎండిపోతున్న వరి చేలను చూసి రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు కురవకపోవడం, ఎగువ నుంచి నీరు సరిగ్గా రాకపోవడం, ప్రధాన కాలువల్లో నీరు లేకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టామని, సాగునీరు లేక దిగుబడి తగ్గుతుందని ఆందోళనగా ఉందని వాపోతున్నారు. మండలంలోని వద్దిపర్రు శివారు చింతల గరువు, పెనుమదం శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దాదాపు రెండు వందల ఎకరాలకుపైగా నీరందకపోవడంతో వరిచేలు ఎండిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సాగునీరందించాలని రైతులు కోరుతున్నారు. ఈ దశలో నీరందకపోతే పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎండిన వరి దుబ్బును చూపి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

కనకరత్నమాలకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - ఆచంట

తాను తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (జీవన సాఫల్య పురస్కారం) అందుకున్నట్లు భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళ సేవా మండలి అధ్యక్షురాలు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా రాష్ట్ర విభాగం సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ కొత్త కనకరత్నమాల వెంకటేశ్వర్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం గమని ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ చింతపట్ల వెంకటాచారి, కమిటీ సభ్యులు పొట్టి శ్రీరాములు అధ్యయన వేదిక సిరిసినిమువ్వ సోషల్ సర్వీస్ అధ్యక్షులు గమని సుబ్బారావు, గ్రంధి సత్యనారాయణ, పి.శ్రీనివాస్ డాక్టర్ కొండూరి నరసింహారావు, అలివేలు మంగాదేవి, గోపిశెట్టి మనోహర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. 1983 నుంచి 2023 వరకూ చేసిన సేవలు శ్రీ శిశుసంక్షేమాభివృద్ధి, గ్రామాభివృద్ధికి పాటుపడుతూ, సుమారు ఐదువేల మందికి రాష్ట్రస్థాయిలో ఉచిత వృత్తి శిక్షణ ఇచ్చి వారికి కుట్టుమిషన్లు, మగ్గాలు గ్రైండర్లు అందించినందుకు గాను ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు అంతర్జాతీయ స్థాయిలో సుమారు వంద అవార్డులు, పలు సన్మానాలు పొందినట్లు ఆమె వివరించారు. ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్, బిజెబిఎస్ ఉమెన్స్ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇలా సుమారు 15 పదవులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అవార్డును అందుకుంటున్న కొత్త కనకరత్నమాల

డివైఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

ఘనంగా డివైఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి

డివైఎఫ్‌ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల వ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిస్కరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా మాజీ నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు తెన్నేటి స్టాలిన్ మాట్లాడారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ అదే స్థాయిలో కరోనా, ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఎందరికో ఆదర్శంగా డివైఎఫ్‌ఐ నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.వెంకట స్వామి, ఎ.పద్మరాజ్, పి.యోహాను, ఎస్.గోపాలకృష్ణ, ఎస్.వాసు, టి.లీలాకృష్ణ పాల్గొన్నారు.

డిఎన్‌ఆర్ మహిళా కళాశాల లెక్చరర్ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ పి.అనిత (41) శుక్రవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతికి సంతాపంగా కళాశాలకు సెలవు ప్రకటించి సంతాప సభ నిర్వహించారు. ఆమె మృతి పట్ల ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, లెక్చరర్లు జాన్ రాజు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థినులు, అధ్యాపకేతర సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

లెక్చరర్ పి.అనిత (ఫైల్‌ఫొటో)

ఆకట్టుకున్న ఆక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శన

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో నిర్వహిస్తున్న ఆక్వా ఎక్స్ ఇండియా -2023లో రెండో రోజు శుక్రవారం సందర్శకుల తాకిడి పెరిగింది. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచే కాకుండా తూర్పు ఆసియా దేశాలు థాయిలాండ్ కొరియా వంటి దేశాల నుంచి ఆయా కంపెనీల నుంచి ప్రతినిధులు, నిపుణులు హాజరయ్యారు. ఆక్వా కోర్సులు చదివే విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలుచోట్ల వాటిని తిలకిస్తూ అవగాహన పెంచే కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. ప్రధానంగా మేతల విభాగంలో ఆక్వా సహజ సాగు కోసం అవసరమైన పెద్ద టెక్నాలజీ ద్వారా తయారైన నేతలను, పరికరాలను ప్రదర్శించారు. వాటిని డెమో ద్వారా రైతులకు వివరించారు. నిర్వాహకుడు వేణు దంతులూరి ఆధ్వర్యంలో పలువురు నిపుణులు సెమినార్‌లో పాల్గొన్నారు.

ప్రదర్శనను తిలకిస్తున్న విదేశీయురాలు

హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మానవత శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి పిల్లలకు ప్రతి నెలా పౌష్టికాహార సరుకుల పంపిణీలో భాగంగా శుక్రవారం పాలకొల్లు కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో సరుకులను పంపిణీ చేశారు. ఎల్ఐసి అధికారి బొప్పన నాగ మల్లేశ్వరరావు ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందజేశారు. పాలకొల్లు శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, డైరెక్టర్స్ బోర్డు కన్వీనర్ ముత్యాల రామారావు, ఉపాధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, కార్యదర్శి పిఎస్.ప్రతాప్‌రాజు, సహాయ కార్యదర్శి ఐ.శివరాం గోపాల్, సభ్యులు బొక్కా రమాకాంత్, ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, బొక్కా గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరికి తరలిరండి

ప్రజాశక్తి - వీరవాసరం

దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి తెలిపారు. చలో విజయవాడ ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రజా ప్రణాళిక బ్రోచర్‌ను శుక్రవారం నవుడూరు సిపిఎం కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు అందరినీ కలవర పరుస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ప్రజా రక్షణ భేరికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము, మైగాపుల త్రిమూర్తులు, మల్లు అప్పారావు, గిద్దా శ్రీనులు పాల్గొన్నారు.

ప్రజా ప్రణాళిక బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిపిఎం నేతలు

లాటా అధ్యక్షునిగా చక్రవర్తి

ప్రజాశక్తి - ఆచంట

అమెరికాలోని లాస్ ఏంజెల్స్ తెలుగు అసోసియేషన్ (లాటా) అధ్యక్షుడిగా ఆచంటకు చెందిన కావూరి చక్రవర్తి ఎంపికయ్యారు. రెండేళ్లకు గాను ఏకగ్రీవంగా ఎంపికైన బోర్డు వివరాలను స్థానిక విలేకరులకు శుక్రవారం ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆచంటలో ప్రాథమిక విద్య, జూనియర్ కళాశాల విద్య పూర్తి చేసిన చక్రవర్తి ఉన్నత విద్య అనంతరం అమెరికా వెళ్లారు. రెండు దశాబ్దాల క్రితం వెళ్లిన ఆయన అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడ్డారు. ఆయన తండ్రి కెజికె మూర్తి ఆచంట మండల వ్యవసాయాధికారిగా పనిచేసి సహాయ సంచాలకులుగా ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలం ఆచంటలో ఉన్న చక్రవర్తి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. లాటా అధ్యక్షుడిగా చక్రవర్తి మాట్లాడుతూ లాస్ ఏంజెల్స్‌లో తెలుగువారంతా ఏటా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా అన్ని పండుగలనూ తెలుగువారమంతా కలిసి సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. తెలుగువారికి వైద్య పరమైన సెమినార్లు ఏర్పాటు, ఐటి విద్యలో శిక్షణ కార్యక్రమాలు, మహిళా సాధికారిత కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. చక్రవర్తి లాటా అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై ఆయన మిత్రులు, బంధువులు అభినందనలు తెలిపారు.

శిబిరాల వద్ద అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గంలో ఈ నెల 4, 5 తేదీలు, డిసెంబరు 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే ప్రత్యేక శిబిరాల దగ్గర బూత్ లెవల్ అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉండాలని నియోజకవర్గ ఇఆర్‌ఒ కెసిహెచ్ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం 6, 7, 8 అప్లికేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ఓటర్లందరూ ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటర్ల ముసాయిదా జాబితాలో తమ పేరును పరిశీలించుకోవాలని తెలిపారు.

ఆర్‌బికెల్లో ధాన్యం విక్రయించాలి : ఎఒ

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు రైతు భరోసా కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి, మద్దతు ధర పొందాలని ఎఒ టికె రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 20 రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల్లో టిఎ, డిఇఒ, హెల్పర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద 300 గోనె సంచులు ముందస్తుగానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు ఏవిధమైన సందేహాలున్నా రైతు భరోసా ఇన్‌ఛార్జి, విఆర్‌ఒను సంప్రదించాలని సూచించారు.

జువ్వలపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - కాళ్ల

అశేష జనాధారణ మధ్య గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు శుక్రవారం జువ్వలపాలెం గ్రామంలో నిర్వహించారు. పివిఎల్ టిడిపి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారులను కలుస్తూ.. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి వారికి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఆయనకు మహిళలు హారతులు పట్టారు.. దారి పొడవునా పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పెన్మత్స విశ్వనాథరాజు, గ్రామ సర్పంచి మీసాల రమణ, ఉప సర్పంచి కఠారి లక్ష్మిపతి రాజు, ఎంపి టిసి మీసాల శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు గుబ్బం బెనహర్, వ్యవసాయశాఖ సలహా మండలి ఛైర్మన్ రుద్రరాజు రామకృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు పాల్గొన్నారు.

పివిఎల్‌కు హారతి ఇస్తున్న మహిళలు

స్వర్ణాంధ్రలో కాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్వర్ణాంధ్ర క్యాంపస్‌లో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా 187 మంది విద్యార్థులు ఎంపికయ్యారని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ప్లేస్మెంట్ సెమినార్ హాల్లో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్మెంట్ ప్రతిష్టాత్మకంగా విద్యార్థులను కొనియాడారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి విద్యార్థీ శ్రద్ధ, ఆసక్తి కనుబరుస్తారో అలాంటి విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో సమాజంలో ఉన్నత పీఠాన్ని అధిరోహిస్తారన్నారు. కళాశాల క్యాంపస్‌లో ప్లేస్మెంట్ ప్రక్రియ నిరంతరంగా ఉంటుందన్నారు. కొండవీటి వెంకటేష్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర కళాశాలలో విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నట్లు, 30 నుంచి 40 మంది విద్యార్థులకు సంబంధిత పెకాల్టీ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అడ్డాల శ్రీహరి, ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ఆలోచనాత్మకంగా ఉండే విద్యార్థిని అమెరికా కంపెనీ తన స్వంత ఖర్చులు పెట్టుకుని అమెరికా లో ఉద్యోగం చేసేందుకు వీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పండరీనాథ్, సురేష్ కుమార్, అడ్డాల శ్రీహరి, పులపర్తి వెంకటేశ్వరరావు, హెచ్‌ఒడిలు మురళీకృష్ణ, గోపిచంద్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని తీర ప్రాంత గ్రామాలలో గురువారం అర్ధ రాత్రి దుండగులు హల్‌చల్ చేశారు. పేరుపాలెం నార్త్‌లోని యూనియన్ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. బ్యాంక్ వెనకవైపున గోడకు రంధ్రం పెట్టిలోనికి ప్రవేశించారు. అలికిడి కావడంతో బ్యాంక్‌లోని స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లకుండా దుండగులు వెనుతిరిగారు. దీంతో బ్యాంకు ఏ విధమైన నష్టం వాటిల్లలేదు. సంఘటనకు సంబంధించి బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. సంఘటన ప్రాంతాన్ని డిఎస్‌పి కె.రవి మనోహరాచారి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

పెనుమంట్ర:ఈ నెల రెండో వారంలోనే ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ దండు అశోక్‌వర్మ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సార్వా ధాన్యం కొనుగోలుపై టిఎ, విఎఎ, పిఎస్‌ఎ, డిఇఒ, కస్టోడియా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అశోక్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఇ-పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే కొనుగోలు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిపిఎస్ ట్రాక్ అమర్చిన వాహనంపై మాత్రమే ధాన్యం ఎగుమతి అనుమతి ఉంటుందని, 162 వాహనాలకు 75 ట్రాక్టర్, మినీ లారీలకు జిపిఎస్ ట్రాక్ అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎ.జ్యోషిల, ఇఒ వి.పూర్ణబాబ్జి, జిల్లా కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎంఎం.రెహమాన్ పాల్గొన్నారు.

పెనుగొండ : ధాన్యం చేరవేసే ట్రాక్టర్‌కు జిపిఎస్ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి పి.స్పందన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో ప్రతి ట్రాక్టర్‌కూ జిపిఎస్ అమర్చుతారని తెలిపారు. ఈ వాహనాల ద్వారానే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతాయని పేర్కొన్నారు. ప్రతి ట్రాక్టర్‌కూ తప్పనిసరిగా జిపిఎస్ అమర్చుకోవాలని తెలిపారు.

ఎలక్షన్ స్పెషల్ క్యాంపెయిన్‌ను వినియోగించుకోండి

ఉండి:ఓటర్ లిస్టులో సవరణల కోసం శని, ఆదివారాల్లో ప్రత్యేక ఎలక్షన్స్ స్పెషల్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జివికె మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 18 సంవత్సరాలు నిండిన వానే ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటరు వెరిఫికేషన్ పూర్తయ్యిందని, ఓటర్ లిస్టులో తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలని తెలిపారు. లిస్టులో తప్పులుంటే సవరించుకోవాలని తెలిపారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు :మొగల్తూరులోని కూరగాయల మార్కెట్లో శుక్రవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. కూరగాయలు, మాంసం వర్తక సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అన్న సమాజంలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి ఆసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

CHANGE OF NAME

I, **Chityala Surendra Kumar, father of Chityala Karthikeya Varun Keshav,** residing at 3-51-5/3, Subbaraopeta Tadepalligudem, submit that my son's name was wrongly shown as **Chityala Kartikeya Varun Keshav** in his **old passport bearing number L1622366.** All his other IDs and certificates bear the name as **Chityala Karthikeya Varun Keshav**. Hence for all practical purposes he shall be known as **Chityala Karthikeya Varun Keshav.**

మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 273/2022

బిట్వీన్:
సంగాని శ్రీనివాసు ...వాది
VS
నాటిన శ్రీను ...ప్రతివాది
టు:
నాటిన శ్రీను, తండ్రి: ముత్యాలరాజు, డో.నెం. 1-103, ముక్కోటి రామాలయం వద్ద, పెదమైనవాని లంక, నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా NPJCJC

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ మీరు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ సారి సదరు ప్రతివాదికి అమలు జరగబోవు దావా సమన్లు Substituted Service By Way Of Publication ద్వారా అమలు జరిపించు నిమిత్తం ది.30-11-2023వ సం॥రం తేదీన వాయిదా వేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు వాయిదా తేదీ **ది.30-11-2023వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియచేయవలెను.** లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును. ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

(By Order Of The Court)

యు.సత్యనారాయణ
నర్సాపురం, అడ్వకేట్, నర్సాపురం.
03-11-23. ప॥గో॥జిల్లా.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 234/2023

బిట్వీన్:
బద్దా రత్నం ...వాది
మరియు
బొబ్బనపల్లి రామచంద్రరావు ...ప్రతివాది
టు: బొబ్బనపల్లి రామచంద్రరావు, తండ్రి: శ్రీను, C/o. బొబ్బనపల్లి చిన్నా, అక్కుపల్లి గోకవరం, ఉంగుటూరు మండలం, ప్రజెంట్ ఏలూరు జిల్లా. TPG PJCJ.

పై నెంబరు దావాలో కోర్టు వారిచే మీకు పలుమార్లు సమన్లు పంపించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీకు ఇందుమూలముగా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సమన్లు జారీ చేయడమైనది. ఇందుపై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి సమక్షములో **ది.17-11-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములను తెలుపుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమున కోర్టు వారిచే తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

*వాయిదా: **17-11-2023***

వద్లాని తేజ
తాడేపల్లిగూడెం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.
31-10-23. సెల్: 83330 83599